ప్రజాశక్తి

శనివారం 1 జూన్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

యుటిఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొమ్మెజు శ్రీనివాసరావు, పక్కనే లక్ష్మణరావు, విఠపు

ఉద్యమాల పురిటిగడ్డ 'చీరాల'

- ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణ్‌రావు
- కన్నుల పండుగగా యుటిఎఫ్ కార్యాలయ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-చీరాల

ఉద్యమాలకు పురిటిగడ్డ చీరాల అని, పొట్టి శ్రీరాములు చేసిన చీరాల-పేరాల ఉద్యమంతో ఆ పేరు వచ్చిందని, ఆ విధంగా ఉద్యమాలకు కేంద్రంగా చీరాల నూతన యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఉండాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం చీరాలలో గౌతమి కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయ ప్రారంభోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మెజు శ్రీనివాసరావు హాజరై భవనాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధ్యక్షులు యస్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెయస్‌యస్.ప్రసాద్, కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు గవిని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. యుటిఎఫ్ 50 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా నూతన భవనం ఏర్పాటు చేసి.. భవనానికి కామ్రేడ్ దాచూరి రామిరెడ్డి స్వర్ణోత్సవ భవనం పేరుతో ప్రారంభోత్సవాన్ని చేయటం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా సహాధ్యక్షులు బండి భిక్షాలు సభా అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి పోరాట యోధుడని, ఆయన అందరికీ ఆదర్శమని అన్నారు. అనంతరం ▶ 2లో

భానుడు భగభగ

- తారెత్తిస్తున్న ఎండలు
- తోడైన రోహిణి కార్తె
- అల్లాడిపోతున్న ప్రజానీకం
- సముద్ర తీరాలలో సేద తీరుతున్న ప్రజలు

నిర్మానుష్యంగా ఒంగోలులోని చర్చి సెంటర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు, సూర్య ప్రతాపంతో ఎండలు తారెత్తిస్తున్నాయి. మండుతున్న ఎండలకు రోహిణీ కార్తె తోడవటంతో పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. ఒక వైపు ఎండ, మరో వైపు వడమటి గాలితో జిల్లా ప్రజానీకం అల్లాడిపోతున్నారు. మరో వారం రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లా ప్రజలు సముద్ర తీరాలలో సేద తీరుతున్నారు.

సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఉదయం 10 గంటలకే ఎండలకు ప్రజలు ఇంటి నుంచి బయటకు రావటానికి భయపడుతున్నారు. ఉదయం 11 గంటలకు దాటితే వీధులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. పెరుగుతున్న ఎండకు వడమటి గాలి తోడు కావటంతో వృద్ధులు, చిన్నారుల పరిస్థితి వర్ణనాతీతం.

ఎండలోనే తప్పని ప్రయాణం

42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు

ప్రకాశం జిల్లాలోని 38 మండలాలలో పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. జిల్లాలోని అన్ని మండలాలలో 38 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పొదిలి, మార్కాపురం, కనిగిరి, యర్రగొండపాలెం, దర్శి, సంతనూతలపాడు, గిద్దలూరు, జిల్లా కేంద్రమైన ఒంగోలులో 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒంగోలులో ఈనెల 29న 42 డిగ్రీల సెల్సియస్, 30న 45 డిగ్రీల సెల్సియస్, 31న 43 డిగ్రీల సెల్సియస్ ▶ 2లో

పటిష్టంగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు

- అభ్యర్థులు, ఏజెంట్లకు వేర్వేరుగా పార్కింగ్
- ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు
- ప్రెస్‌మీట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడి

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ ఎస్పి గరుడ్ సుమిత్‌సునీల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్, 8 అసెంబ్లీ సెగ్మెంట్స్‌కు సంబంధించి వల్లూరులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆయా కౌంటింగ్ కేంద్రాలలో 14 టేబుళ్ల ఏర్పాటు చేశామని, ఈవిఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్,(గజిటెడ్), ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్(గజిటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గజిటెడ్), ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. ఈటిపిబీస్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక సూపర్ వైజర్, ఒక అసిస్టెంట్, ఒక ఎఆర్ఓ ఉంటారన్నారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు కేంద్రంకు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాలకు వెళ్ళటానికి సిబ్బందికి, ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామన్నారు. ఏయే బ్లాక్‌లలో ఏయే నియోజకవర్గాల లెక్కింపు జరుగుతుందో అందరికీ అర్థం అయ్యేలా సైన్ బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కోసం కౌంటింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు వారికి అవసరమైన శిక్షణా కార్యక్రమాన్ని విడతల వారీగా ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు విధులు కేటాయింపులో భాగంగా ఈ నెల 22న మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. జూన్ 2న రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను, జూన్ 4న కౌంటింగ్ రోజు ఉదయం 6 గంటలకు మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపడతామని కలెక్టర్ వివరించారు. కౌంటింగ్ రోజున సుమారు 2400 మంది ఏజెంట్స్, 1500 మంది కౌంటింగ్ సిబ్బంది, సుమారు 1000 మంది పోలీసు సిబ్బంది కౌంటింగ్ విధులకు హాజరు కావటంతో వారికి వేర్వేరుగా గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు. కౌంటింగ్ విధులకు హాజరయ్యే అభ్యర్థులకు, ఏజెంట్స్‌కు, సిబ్బందికి వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్ ప్రదేశాల నుండి కౌంటింగ్ ప్రదేశానికి తీసుకెళ్ళటానికి ప్రత్యేకంగా వాహనాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్ ఎమర్జెన్సీ కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ▶ 2లో

3న సాయంత్రం నుంచి

144 సెక్షన్ అమలు

- బాపట్ల, అద్దంకి, చీరాల, రేపల్లె ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి
- పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- ఎస్పీ వకుల్ జిందాల్

మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జూన్ 3న సాయంత్రం నుండి 144 సెక్షన్ కఠినంగా అమలుచేస్తామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. చీరాల, బాపట్ల, రేపల్లె, అద్దంకిలలో 3న సాయంత్రం నుండి కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు దుకాణాలు, హెూటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు తెరవడానికి వీలు లేదన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు, పోలీస్ అధికారులు సిబ్బంది నిర్వహించవలసిన విధుల గురించి వివరించారు. జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ జిల్లా పోలీస్ అధికారులు ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. అక్కడక్కడా చిన్నచిన్న ఘర్షణలు చెలరేగినప్పటికీ వాటిని సమర్థవంతంగా కట్టడి చేయడంలో సఫలీకృతం అయ్యారన్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉంటే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. గతంలో ఘర్షణలకు పాల్పడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని, మరలా వారు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా వారిపై నిఘా ఉంచాలన్నారు. జూన్ 1 నుండి 5వ తేదీ వరకు హెూటళ్లు, ▶ 2లో

భానుడు భగభగ

(మొదటిపేజీ తరువాయి)

ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎండలకు తోడైన రోహిణీ కార్తె

పెరుగుతున్న ఎండలకు రోహిణీ కార్తె తోడు కావటంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గత రెండు రోజులుగా రోహిణీ కార్తె సందర్భంగా 40 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో 5 నుంచి 6 రోజుల పాటు రోహిణీకార్తె కొనసాగనుంది. ఈ రోజులలో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు ఉదయం వేళలలో బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు ప్రజలకు ఎవరూ బయటకు రాకుండా ఉండటం శ్రేయస్కరమని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో బయటకు రావాల్సి వస్తే ప్రజలు గొడుగులు వాడాలని, ద్విచక్ర వాహనదారులు టోపీలు, ముఖానికి రుమాలు వంటి కట్టుకొని ప్రయాణాలను కొనసాగించాలన్నారు. ఎక్కువ మంచినీళ్ళు, కొబ్బరి నీళ్ళు, గ్లూకోజ్ నీళ్ళు, పండ్ల రసాలు, ఓఆర్ఎస్ వాడాలని సూచించారు. రానున్న మరో ఐదు రోజుల పాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి చిన్నపాటి అస్వస్థత కలిగినా.. సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని సూచించారు. వడదెబ్బ, ఇతర సమస్యలకు అవసరమైన మందులన్నీ పిహెచ్‌సిలలో అందుబాటులో ఉన్నట్లు డిఎంహెచ్ఒ తెలియజేశారు.

ఉద్యమాల పురిటిగడ్డ 'చీరాల'

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యాయ సమస్యలపై, విద్యారంగంలో జరిగిన పలు మార్పులు వివిధ అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తితో యుటిఎఫ్‌ను ముందుకు తీసుకువెళ్లేందుకు ఈ భవనం వేదిక కావాలన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయులచే, ఉపాధ్యాయుల కోసం నిర్మించిన యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని సుమారు రూ.78 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. ఏ రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా సుమారు 475 మంది ఉపాధ్యాయులు రూ.5 వేల నుండి రూ.లక్ష వరకు విరాళాలు అందించారని తెలిపారు. దీనిని భవిష్యత్‌లో లైబ్రరీగా, విజ్ఞాన కేంద్రంగా చేయబోతున్నామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నక్క వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్, కె.శ్రీనివాసరావు, పి.బాబురెడ్డి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు, నాయకులు జె.వినయ్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు, వీరారెడ్డి, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, సూరిబాబు, సిహెచ్.హనుమంతరావు, బి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌డి కరుణకుమారి, ఎస్.పాపారావు, ఆర్.హరిప్రియ, ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.రజనీకుమార్, పి.సురేష్, ఎస్‌వి.సుబ్బారెడ్డి, పి.సీతారామరాజు, చెంచయ్య, విజయలక్ష్మి, పద్మావతి, ఎం.శ్రీనివాసులు, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వీరాంజనేయులు దంపతులకు ఘన సన్మానం

ఎస్‌ఎ ఆర్‌ఆర్‌ఎమ్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన కె.వీరాంజనేయులు దంపతులను ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పలువురు వారిని ఘన సన్మానం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో 39 సంవత్సరాలుగా సేవలందించిన వీరాంజనేయులుకు భవన ప్రారంభోత్సవం నాడే ఉద్యోగ విరమణ సన్మానం చేయటం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాలువాలతో, పూలమాలలతో ఘనంగా వారిని సత్కరించారు.

సక్రమ విధులతోనే మన్నన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

సిహెచ్ఓ రత్నమ్మను సన్మానిస్తున్న వైద్యాధికారులు

ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారని కొనకనమిట్ల, గొట్లగట్టు వైద్యాధికారులు ఎస్పీ బాలయ్య, కె సురేఖ, పృథ్వీరాజు, నరేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ తాతపూడి రత్నమ్మ, పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు సూపర్వైజర్ ప్రతాపరెడ్డి అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్పీ బాలయ్య మాట్లాడుతూ 39 సంవత్సరాలు వైద్య వృత్తిలో వివిధ పదవులలో పని చేసి పలువురి మన్ననలు పొందారని అన్నారు. కరోనా సమయంలో అధైర్యపడకుండా జూనియర్ సిబ్బందిని వెంటపెట్టుకొని అనేకమందికి వైద్య సేవలు అందించటం అభినందనీయమని కొనియాడారు. పలువురు ఏఎన్ఎంలు మాట్లాడుతూ సిహెచ్ఓ రత్నమ్మ తమకు ఆదర్శమని అన్నారు. అనంతరం రత్నమ్మను వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రత్నమ్మ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులతో కలిసి జన్మదిన వేడుకల్లో కంది ప్రమీలారెడ్డి

మానసిక వికలాంగులకు భోజనం

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శి కంది ప్రమీలా రెడ్డి జన్మదిన వేడుకలు మార్కాపురం పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ వికలాంగుల మానసిక పాఠశాలలో శుక్రవారం రాత్రి జరిగాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మానసిక వికలాంగ విద్యార్థుల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. ఆ పాఠశాలకు ఆమె ఆర్థిక సాయం అందించారు. మానసిక వికలాంగుల పట్ల ప్రేమను చూపిన ప్రమీలరెడ్డిని పలువురు అభినందించారు. ఈ వేడుకల్లో వైసిపి నాయకుడు జె నాగిరెడ్డి, జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలు

(మొదటిపేజీ తరువాయి)

లాడ్జిలు, రిసార్ట్స్‌లను తరచూ తనిఖీ చేయాలని, వాటిలో బస చేసే వారి వివరాలను తెలుసుకొని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడానికి అవకాశం ఉన్నవారు, గతంలో నేరాలకు పాల్పడినవారు ఎవరైనా ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. జూన్ 1 నుంచి జిల్లాలో షాడో పార్టీలను ఏర్పాటు చేయాలని, వీరు రాజకీయ పార్టీల అభ్యర్థులను ఎప్పటికప్పుడు అనుసరిస్తూ ఒకే సమయంలో రెండు పార్టీల అభ్యర్థులు ఒకే ప్రదేశంలో చేరుకునే అవకాశం ఉన్నా, ఎదురుపడే అవకాశం ఉన్న వెంటనే సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు సమాచారం అందించాలని చెప్పారు. అభ్యర్థుల ఇంటి వద్దకు, పార్టీ కార్యాలయాలకు కార్యకర్తలు, ప్రజలు చేరుకుంటే దానికి సంబంధించిన సమాచారాన్ని ఎస్‌హెచ్‌ఓకు తెలియజేయాలన్నారు. వెంటనే స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు అప్రమత్తంగా వ్యవహరించి ఘర్షణలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో డిఎస్పీలు సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ రోజున వారు ఎలా వ్యవహరించాలి, చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై తీసుకునే చర్యల గురించి వారికి అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారు గొడవలు పడే అవకాశం ఉంటుంది కనుక బహిరంగ ప్రదేశాలలో ఎవరు మద్యం సేవించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై స్పెషల్ రైడ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలను పోలీస్ అధికారులు తరచు సందర్శిస్తూ ఉండాలన్నారు. ఆ ప్రాంతాలలో పికెట్లను ఏర్పాటుచేయాలని, పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. చీరాల, బాపట్ల నియోజకవర్గాలలోని మార్గాలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, చెక్ పోస్టులలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి రాళ్లు, ఇనుప రాడ్లు, కర్రలు ఇతర వస్తువులు, మారణాయుధాలు ఉంటే ఆ వాహనాన్ని సీజ్ చేసి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది లాఠీ, హెల్మెట్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. నాకాబందీ నిర్వహించి సీజ్ చేయబడిన వాహనాలను కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు విడుదల చేయరాదని చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెక్ చేసి రిలీజ్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత మాత్రమే వాటిని సంబంధిత వ్యక్తులకు అందజేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, చీరాల డిఎస్పీ బి ప్రసాద్, రేపల్లె డిఎస్‌పి టి మురళీకృష్ణ జిల్లాలోని సిఐలు, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్న ప్రధానోపాధ్యాయులు పెనుబోతు రామారావు, తెలుగు ఉపాధ్యాయులు కసుకుర్తి సుబ్బారావులను పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయిని నల్లూరి ఉమామహేశ్వరి అధ్యక్షత వహించారు. కార్య క్రమంలో మండల విద్యాశాఖాధికారి వెంకారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి స్టాఫ్ సెక్రటరీ వజ్రాల మాధవీలత స్వాగతం పలుకగా పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఆత్మీయులు, బంధువులు, స్నేహితు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి వెంకారెడ్డి మాట్లాడుతూ ఇరువురు ఉపాధ్యాయుల విశిష్ట సేవలను ఆయన కొనియాడారు. పలువురు ఉపాధ్యాయు లు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు పెనుబోతు రామారావు, కసుకుర్తి సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారంతో తమ సర్వీసును విజయవంతంగా పూర్తి చేయగలిగామని అన్నారు. సహకరించిన అందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్టు మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలేనికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎస్ఎండి కలీంబాషా(48) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతి చెందిన కలీంబాషా పార్థివ దేహానికి యర్రగొండపాలెంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలి పారు. కార్యక్రమం లో యర్రగొండ పాలెం పట్టణం లోని జర్నలిస్టు లు పాల్గొన్నారు.

కలీంబాషా(ఫైల్)

పటిష్టంగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

బ్యారిడింగ్ ఏర్పాటు, పటిష్ట పోలీసు బందోబస్తు, నిరంతరం విద్యుత్ సరఫరా, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టడంతో పాటు తాగునీరు, భోజన వసతి సౌకర్యాల కల్పనపై ప్రత్యేకంగా చర్యలు చేపట్టామన్నారు. పనిచేసి కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అన్నీ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టామన్నారు. మీడియాకు ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రౌండ్ వారీ ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేలా ప్రతి నియోజక వర్గానికి ఒక పరిశీలకులను, 300 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

జిల్లాలో ఈ నెల 4వ తేదీన రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. మూడంచెల విధానంలో బందోబస్తుతో పాటు 200 సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంవద్దకు ఎలాంటి ఆయుధాలతో రాకూడదని, మత్తు పదార్థాలు సేవించి రాకూడదని, కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్‌పి తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. హొటళ్లు, లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుంటామని ఎస్‌పి వివరించారు. కౌంటింగ్ తరువాత ఎవరైనా విజయోత్సవాలు, ర్యాలీలు నిర్వహించాలన్నా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని, ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడానికి జిల్లా యంత్రాగానికి తమ వంతు సహకారం అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను, పోటీలో వున్న అభ్యర్థులను, ప్రజలను ఎస్‌పి కోరారు. సమావేశంలో డిఆర్ఒ ఆర్. శ్రీలత, కలెక్టరేట్ ఏఒ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS NO : 280/2023

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్.బి.ఎం కాంప్లెక్స్ బ్రాంచి రిప్రజెంటెడ్ బై సీనియర్ బ్రాంచి మేనేజర్ ఒంగోలు ..... వాది

వర్సెస్

ఎల్.ఆర్.ఎంటర్ ప్రైజస్ రిప్రెజెంటే డ్ బై ఇట్స్ ప్రొప్రయిటర్ పోల్లపోతు అనుపమ ... ప్రతివాది

To

పోల్లపోతు అనుపమ, భర్త నాగప్రసాద్ ప్రొప్రయిటర్ ఎల్ఆర్ ఎంటర్ప్రైజెస్ , షాప్ నెంబర్ 265 E, ఎస్.బి.ఎం. కాంప్లెక్స్, ట్రంకు రోడ్డు, ఒంగోలు 523001, ప్రకాశం జిల్లా.

నివాసం : డోర్ నెంబర్ 46-1-18(A), రాజరాజేశ్వరి వీధి, రంగుతోట, ఒంగోలు ప్రకాశం జిల్లా.

వాది దావా పరిహారము రాబట్టుకును నిమిత్తం పై నెంబరు మీపై దావా దాఖలు చేయగా మీకు దావా సమన్లు నిమిత్తము తేది 05-07-2024 ఉదయం 10 గంటల 30 నిమిషాలకు వాయిదా ఉన్నందున మీరు స్వయంగా గాని లేక వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపు కొనని యెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు

దండూరి వెంకటేశ్వర్లు, Bcom. BL

వాది తరపు న్యాయవాది

ఛాంబర్ ఎస్ 2 బ్లాక్,

జిల్లా కోర్టు ఆవరణ, ఒంగోలు

సెల్ : 9397865123

కళా పోషకుడు ఆంజనేయులు

- ఆరుపదుల వయస్సులోనూ

వివిధ వేషధారణలో ఆకట్టుకుంటున్న వైనం

ప్రజాశక్తి-మద్దిపాడు

ఆయన వేషాధారణకు ప్రజలు మంత్ర ముగ్ధులవుతారు. ఆలయాలకు సంబంధించి ఎచిన్న కార్యక్రమం నిర్వహించినా అక్కడికి దేవుడి రూపంలో ప్రత్యేక్షమవుతాడు. ఆరు పదుల వయస్సులోనూ అందరితో ఆడతాడు.. పాడతాడు... ఎలాంటి లాభాపేక్ష లేకుండా జనాల మన్నలలు చూరగొంటూ మంచి కళాకారుడిగా మండవ ఆంజనేయులు మంచి గుర్తింపు పొందారు. హనుమాన్ జయంతి సందర్భంగా మరోసారి ప్రజలను అలరించేందుకు సిద్ధమయ్యాడు. ఆ వివరాలు ఏంటో చూద్దాం...

మండల పరిధిలోని సీతారామపురం గ్రామానికి చెందిన మండవ ఆంజనేయులు 65 సంవత్సరాల వయస్సులోనూ దేవుళ్ల రూపాల్లో అవతారమెత్తి కళాకారుడిగా ప్రజలను అలరిస్తున్నాడు. దశాబ్ద కాలంగా గ్రామాల్లో ఎక్కడ తిరునాళ్లు జరిగినా, దేవాలయాలకు సంబంధించిన కార్యక్రమాలు జరిగినా ఆంజనేయులు దేవుడి రూపంలో ప్రత్యేక్షమవుతాడు. రాముడు, ఆంజనేయుడు, పోతురాజు, అమ్మవారు, శివుడు, బాబా ఇలా ఎన్నో వేషాలను వేసి తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. నేడు హనుమాన్ జయంత్ సందర్భంగా సీతారామపురం గ్రామంలోని కొస్టాలు సెంటర్ వద్ద హనుమాన్ వేషాధారణకు సిద్ధమవుతున్నాడు.

ఊపిరి ఉన్నంత వరకూ ప్రజలను అలరిస్తా కళాకారుడు మండవ ఆంజనేయులు

కళాకారుడిగా తనకు వచ్చే ప్రశంశలు మాటల్లో వర్ణించలేను. ప్రజలలో ఓప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాను. మా గ్రామస్తులైతే పిలిచి మరి నాట్యం చేయమంటారు. నాతోపాటు జతకట్టి నాట్యం చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతారు. మా భార్య వెంకట శేషమ్మ, కుమారుడు, కుమార్తె ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది. వంట్లో ఊపిరి ఉన్నంత వరకూ దేవుళ్ల వేషాధారణలతో ప్రజలను అలరింపజేస్తూనే ఉంటా.

ఆంజనేయుడి వేధదారణలో

మండవ ఆంజనేయులు

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-దర్శి

అగ్రికల్చర్ డిప్లమాలో చేరే వారు ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని దర్శి అగ్రికల్చర్ డిప్లొమా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎల్.రాజేష్ చౌదరి తెలిపారు. 10వ తరగతి పాసై అగ్రికల్చర్ డిప్లొమా చదవాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా దర్శిలోని పరిశోధన స్థానం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ డిప్లమా కళాశాల నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి -కనిగిరి

మండల పరిధిలోని చల్లగిరిగల గ్రామంలో కనిగిరి సిఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటిలో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎస్ఐ ఎస్ఐ త్యాగరాజు , హనుమంతునిపాడు ఎస్ఐ శివ నాగరాజు, పిసిపల్లి ఎస్ఐ రమేష్ బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి చినవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 965 పొగకు బేళ్లను శుక్రవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 900 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 65 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.336 ,అత్యల్ప ధర రూ.205 సరాసరి ధర రూ. 265.36 పైసలు పలికింది.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ప్రజాశక్తి -కనిగిరి

రహదారులపై గుంతలు పూడ్చి ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. సమస్య- పరిష్కారంలో భాగంగా కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు నుంచి డిగ్రీ కాలేజీ వరకూ హైవే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ హైవే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు గుంతలకు మరవ్మతులు చేయించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఈ పాటికే జిల్లా కలెక్టర్ చొరవతో కొంత మేర రహదారికి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. అధికారులు స్పందించి హైవే రోడ్డును సిసి రోడ్డుగా మార్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,చౌడిశెట్టి శ్రీనివాసులు నాయుడు, శ్రీనివాసులు, యాళ్ళ కష్ణారెడ్డి, శ్రీహరిరెడ్డి ,శంకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

సివిల్ సప్లయి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-దొనకొండ

ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

దొనకొండ పౌరసరఫరాల శాఖ గోడౌన్ పరిధిలో నుంచి ప్రభుత్వం 20 రేషన్‌షాపులను తొలగించి కార్మికుల పొట్టగొట్టిందని సిఐటియు మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య విమర్శించారు. సివిల్ సప్లయి ముఠా యూనియన్ అధ్యక్షుడు గుడిమెట్ల ఆదాము అధ్యక్షతన సివిల్ సప్లయి గోడౌన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ దొనకొండ, కురిచేడు మండలాల్లో 20 రేషన్‌షాపులకు సంబంధించిన ఆహార ధాన్యాల ఎగుమతి, దిగుమతులను దూర ప్రాంతాల్లో ఉన్న మార్కాపురం, యర్రగొడపాలెంలోని స్టాక్ పాయింట్లకు కేటాయించినట్లు తెలిపారు. దీంతో ఇక్కడ కార్మికులకు పనులు తగ్గిపోయినట్లు తెలిపారు. గత 30 ఏళ్లుగా దొనకొండ స్టాక్ పాయింట్ల పరిధిలోని దొనకొండ, కురిచేడు మండలాల రేషన్‌షాపులను దొనకొండ స్టాక్ పాయింట్ నుంచే సరుకులు రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు యర్రగొండపాలెం, మార్కాపురం స్టాక్ పాయింట్ల పరిధిలోని వాటిని మార్చినట్లు తెలిపారు. ఫలితంగా 30 మంది కార్మికులు జీవనోపాధి కొల్పోయారని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి అధనంగా రవాణా భారం పడుతుందన్నారు. డీలర్లు సహితం స్టాక్ పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లి రావడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు విషయం గుర్తించి గతంలో ఉన్న విధంగానే దొనకొండ స్టాక్ పాయింట్ నుంచే రేషన్‌షాపులకు ఆహార పదార్థాలు సరఫరా చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పోరుమామిళ్ల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, దారం నరసింహరావు, శ్రీనివాసరావు, కర్నా హనుమయ్య, కుందుర్తి అనీల్, ఎ కార్మికులు పాల్గొన్నారు.

పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం

పొగాకు వేలం కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- టంగుటూరు

రైతులు పొగాకు వేలానికి అన్ని రకాల గ్రేడ్లను తెచ్చుకోవాలని ఒంగోలు పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం. లక్ష్మణరావు సూచించారు. పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ మార్కెట్‌లో అమ్ముడు పోతున్న పొగాకు బేళ్లను పరిశీలించి, ఆ రకం బేళ్లను తెచ్చుకోవాలన్నారు. సాఫ్ట్, హీట్, ఎన్‌టిఆర్ఎం, గ్రేడ్ మిక్స్ లేకుండా పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చుకోవాలన్నారు. కట్టుబడివారిపాలెం గ్రామస్తులు శుక్రవారం వేలం కేంద్రానికి పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో పొగాకు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, పలువురు రైతులు, బోర్డు సిబ్బంది తదితరులు పాలొంగ్గన్నారు.

పొగాకు నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి -కనిగిరి

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకొని గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక దేవాంగనగర్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా గుడ్ హెల్ప్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 'ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988వ సంవత్సరం నుంచి పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించినట్టు తెలిపారు.ఈ ఏడాది పొగాకు నుంచి పిల్లలను రక్షించడం ఎలా నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో పొగాకు ఉత్పత్తుల వినియోగదారులు రోజురోజుకూ పెరుగుతున్నట్లు తెలిపారు. వారు అనారోగ్యానికి గురికావడమే కాకుండా ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు చుట్ట, బీడీ, సిగరెట్లు, కాల్చే వారికే కాకుండా ఆ పొగను పీల్చే వారికి కూడ ఊపిరితిత్తులు, గొంతు కేన్సర్, గుండెపోటు, రక్తపోటు, మధుమేహం, కంటి చూపు మందగించడం లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని నివేదికలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. వాటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు. గుడ్ హెల్ప్ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

'108' డ్రైవర్‌పై దాడి

ప్రజాశక్తి- కురిచేడు

108 వాహన డ్రైవర్‌పై ఓ వ్యక్తి బీరుబాటిల్‌తో దాడితో చేసి గాయపరిచాడు. ఈ ఘటన మండల పరిధిలోని బోధనంపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... బోధనంపాడు గ్రామానికి చెందిన 108 వాహన డ్రైవర్ అబుదావలికి, అదే గ్రామానికి గోవింద రమేష్ మధ్య చిన్న పాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో అబుదావలిని రమేష్ బీరు బాటిల్‌తో కొట్టి గాయపరిచాడు. అనంతరం గొంతుపై కాలుతో నొక్కాడు. క్షతగాత్రుడిని ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో గుంటూరు ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న కురిచేడు ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-దొనకొండ

వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలం లోని తెల్లబాడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. తెల్లబాడు గ్రామానికి అంకాల సిద్ధయ్య(62) గొర్రెలను మేత కోసం పొలం తోలుకెళ్లాడు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై పొలంలోనే సోమ్మసిల్లి పడిపోయాడు. తోటి గొర్రెల కాపరులు ఈ విషయాన్ని గమనించి సిద్ధయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని ఆటోలో సిద్ధయ్య హాస్పిటల్ తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే సిద్ధయ్య మృతిచెందాడు. సిద్ధయ్య భార్య పదేళ్ల క్రితమే చని పోయింది. ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-దొనకొండ

మండల పరిధిలోని మల్లంపేట, చందవరం గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 108 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. మల్లంపేట గ్రామంకు చెందిన వడ్లమూడి రమణయ్య వద్ద 43 బాటిల్స్, చందవరం గ్రామానికి చెందిన శెట్టిబత్తిన కాశయ్య వద్ద 65 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-దర్శి

దర్శి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న డేవిడ్ (56) గురువారం రాత్రి గుండె పోటుతో మతి చెందాడు. ఆయన మతదేహాన్ని స్థానిక లంకోజనపల్లి రోడ్‌లోని స్వగహంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. దర్శి డిఎస్‌పి టి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, సిఐ షమీముల్లా, ఎస్ఐ సుమన్ పోలీసు సిబ్బంది ఆయన మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కోర్టు సమీపంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. డేవిడ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అదుపుతప్పి దూసుకెళ్లిన కంటైనర్ తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- సంతమాగులూరు

ఓ కంటైనర్ అదుపు తప్పి బైకు రిపేర్ దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో దుకాణంలోని బైకులు, రేకుల షెడ్ ధ్వంసమయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఏల్చూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న కంటైనర్ అదుపుతప్పి రహదారి ప్రక్క ఉన్న బైక్ రిపేర్ రేకుల షెడ్డులోకి దూసుకెళ్లింది. దీంతో ద్విచక్ర వాహనాలు, రేకుల షెడ్డు ధ్వంస మయ్యాయి. ఈ ప్రమాదంలో లక్ష రూపాయలకు పైగా ఆస్తి నష్టం వాటినట్లు దుకాణం యజమాని షేక్ కరీముల్లా తెలిపారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చీరాల

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అందరికీ అవగాహన అవసరమని డీఎన్‌బీ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నాగళ్ల ప్రదీప్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఒంగోలు హెచ్‌సిజిఎంఎన్‌ఆర్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏకైక ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహిస్తున్న హాస్పిటల్ ఎంఎన్‌ఆర్ క్యాన్సర్ సెంటర్ అన్నారు. వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ క్రింద క్యాన్సర్ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉంటే తక్షణమే ఒంగోలులోని తమ హాస్పిటల్‌నందు సంప్రదించి ఆరోగ్య వంతులుగా ఉండాలని కోరారు. శిబిరంలో క్యాన్సర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ విజయమ్మ

పొగాకు ఉత్పత్తుల వ్యతిరేక ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జాతీయ పొగాకు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పొగాకు వినియోగ వ్యతిరేక ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల్లో నిర్వహించి అంబేద్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. పొగాకు వినియోగ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఒ ఎస్ విజయమ్మ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి విద్యార్థులను రక్షించాలని అన్నారు. ఈనెల 31 నుండి 20 రోజుల పాటు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యా సంస్థను పొగాకు రహిత విద్యా సంస్థగా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. 2003 పొగాకు ఉత్పత్తుల నివారణ చట్టం కఠినంగా అమలుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య అధికారిణి రమాదేవి, టి వెంకటేశ్వర్లు, డిపిఎంఒ రోహిణి, ఎన్‌సిడిపిఒ సౌజన్య, పి సుజాత, బి రమేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఒ శ్రావణ్‌కుమార్

ఓట్ల లెక్కింపు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ విధి విధానాలపై అవగాహన కలిగి ఉండాలని రిటర్నింగ్ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాలులో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లకు అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. లెక్కింపు కేంద్రాల్లోకి వచ్చే సిబ్బంది అనుమతి పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ తీసుకురావద్దని చెప్పారు. సమావేశంలో డిఎస్పి మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన జెవివి కిడ్స్ సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - అద్దంకి

కిడ్స్ సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. తొలుత డాక్టర్ కెపిఎస్ తనూజ పిల్లల్లో రక్తహీనత ఏర్పడుట, నివారణ, జాగ్రత్తలను వివరించారు. మారెళ్ళ హెల్త్ ఎడ్యుకేటర్ కెఎ రాజు విద్యార్థులందరికీ హిమోగ్లోబిన్ పరీక్ష చేశారు. విద్యార్థులకు ఐరన్ టానిక్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ జంక్ ఫుడ్స్ మానేయాలని సూచించారు. ప్రతి రోజూ కనీసం ఒక పండు తినాలని చెప్పారు. రెండు పూటలా బ్రష్ చేసి మంచి పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. కావూరి ధనలక్ష్మి విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా నేత్రమూర్ 30 హోమియో మందును ఉచితంగా పంపిణీ చేశారు. సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జెవివి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12 రోజుల సమ్మర్ క్యాంపులో విద్యార్థులలో సహజ నైపుణ్యాలను పెంచే ఎన్నో అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని అంతరంగిక నైపుణ్యాలను వెలికి తీసే విధంగా చిత్రలేఖనం, ఒరిగామి, ఫన్ గేమ్స్, ఫన్ మ్యాథ్స్, సైన్స్ ప్రయోగాలు, స్పోకెన్ ఇంగ్లీష్, మాతృభాష ప్రాముఖ్యత, పజిల్స్, ఆరోగ్యం, పర్యావరణం వంటి ఎన్నో అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణను ఇంతటితో ఆపకుండా సంవత్సరం అంతా ఈ అంశాలను ప్రాక్టీస్ చేయాలని, మూఢ నమ్మకాలను ప్రశ్నించడం ద్వారా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. పర్యావరణ సైనికులు, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని చెప్పారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. విద్యార్థులందరికీ 40మొక్కలు పంచి పెట్టారు. స్థానిక గురవాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు టివి రత్నం, పిఎన్ఎమ్ నాయకులు రాజా రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులతో జెవివి జిల్లా కార్యదర్శి తంగా శ్రీనివాసరావు

యానిమేటర్లకు బీమా సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల

వెలుగు పథకంలో పనిచేస్తున్న యానిమేటర్లకు ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం కల్పించక పోవడం అత్యంత దారుణమని విఒఎ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి అన్నారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వెలుగు పథకంలో పనిచేసే యానిమేటర్లకు ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడంతో యూనియన్ సభ్యులను ఆదుకునేందుకు యూనియన్ సభ్యులు సొసైటీగా ఏర్పడి బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇటీవల మరణించిన చెరుకుపల్లి మండల యానిమేటర్ల సంఘం అధ్యక్షురాలు డి రమాదేవి కుటుంబానికి ప్రభుత్వం నుండి ఏ విధమైన సహాయం అందలేదని అన్నారు. విఒఎ సంఘం స్పందించి రూ.50వేల విలువైన చెక్కును ఆమె కుమారుడు డి కార్తీక్‌కు అందజేశారు. ఈసందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వెలుగు పథకంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న యానిమేటర్లకు ప్రభుత్వం నుండి ప్రమాద బీమా, ఇతర సహాయ సహకారం అందకపోవటంతో యూనియన్ తరఫున సహాయం అందజేసినట్లు తెలిపారు. యానిమేటర్ల ప్రమాద బీమా సౌకర్యంపై పునరాలోచించి ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె లక్ష్మి, జిల్లా కోశాధికారి జ్యోతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ముత్యాలరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న ధనలక్ష్మి

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - చీరాల

సినీ వినీలాకాశంలో ఎంతో మందికి సహాయ సహకారాలు అందించి, సేవాభావంతో ఉన్నతంగా రాణించిన మహనీయులు సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ అని మునిసిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, సూపర్ స్టార్ కృష్ణ అండ్ మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సలాం అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ 81వ జయంతి సందర్భంగా పట్టణంలో మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మహిళా మండలిలోని వృద్ధులకు అన్నదానం చేశారు. సూపర్ స్టార్ కృష్ణ తన సినీ జీవితాన్ని తేనె మనసులు సినిమాతో ప్రారంభించి ధ్రువతారల నిలిచినట్లు కొనియాడారు. సినీ నటునిగా, సామాజిక, సాంఘిక సంస్కర్తగా పేరొందినట్లు తెలిపారు. ఇంత ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఎస్కె రఫీ, బొనిగల యోహాను, సూరిబాబు, మౌలాలి, సుబ్రహ్మణ్యం, రవి, అభిమానులు పాల్గొన్నారు.

పర్చూరు : సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు అభిమానులు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. దేవరపల్లికి చెందిన కృష్ణ వీరాభిమాని తోకల కృష్ణమోహన్ పెద్ద కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. స్థానిక బొమ్మల సెంటర్లో రోటరీ సభ్యులతో కలిసి వెయ్యి మంది ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘాల నాయకులు మహేష్ బాబు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. నేడు కృష్ణ పుట్టినరోజుతో పాటు ఆయన అభిమాని తోకల కృష్ణమోహన్ పుట్టినరోజు కూడ కావడం ఒక విశేషం. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, పాతోలు వెంకన్న, కృష్ణ అభిమానులు తులసి శ్రీనివాసరావు, అల్లడి చెన్నయ్య, రామకృష్ణ, లంకా లక్ష్మణ్, జంగా అనీల్, రామారావు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం చేస్తున్న కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్

పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న తోకల కృష్ణమోహన్

ఫార్మసీ విద్యార్థులతో వనమా రామకృష్ణారావు

ఉత్తమ ఫలితాలు సాధించిన బిఫార్మసీ విద్యార్థులు

ప్రజాశక్తి - వేటపాలెం

కాకినాడ జెఎన్‌టియు పరిధిలో గత ఏప్రిల్ నెలలో నిర్వహించిన బి ఫార్మసి మొదటి సంవత్సరం 1వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో సెయింట్ ఆన్స్ ఫార్మసి కళాశాలకు చెందిన విద్యార్థులు 90.19 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ వివి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన, మంచి లైబ్రరి సౌకర్యం, అత్యాధునిక ప్రయోగశాల, ఉచితంగా ఇంటర్ నెట్, కమ్యూనికేషన్ స్కిల్స్ బోధన, అత్యాధునిక కంప్యూటర్ లాబ్ సౌకర్యాలను కల్పించడం వలన ఈ ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. బి ఫార్మసి విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కృషి, ఆధ్యాపకుల ప్రోత్సాహాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఫ్రెండ్స్ సభ్యులు

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - బాపట్ల

క్యాన్సర్ వ్యాధి బాధితుడికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. పట్టణంలోని 12 వార్డు, రాణి కాలనీలో అదే ఇంట్లో నివాసం ఉంటూ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పొగడ్ల ఆదిశేషుకు ఆర్థిక సహాయం అందించి తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. పాత ఇనుప సామాన్లకు ఉల్లిపాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఆదిశేషులకు దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, కోశాధికారి జోగి సువర్ణ, కందుల శ్రీకాంత్, యాసం రాజా రమేష్, చామర్తి సుబ్బారావు, బీమా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఆర్ రమేష్

డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి - పర్చూరు

వాహనదారుల ధ్రువీకరణ పత్రాలతో పాటు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ ఆర్ రమేష్ అన్నారు. నాకాబందీలో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు స్థానిక వై జంక్షన్లో వాహనాల తనిఖీ శుక్రవారం నిర్వహించారు. ధృవీకరణ పత్రాలు లేని వాహనాలను స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనాలకు సంబంధించి ధృవీకరణ పత్రాలు లేకపోవడం ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నేరాలను అరికట్టడంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి,-టంగుటూరు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండు చేశారు. మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల కోసం నాలుగైదు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లాల్సివస్తుందని కూలీలు తెలిపారు. దీంతో ఎండ తీవ్రతతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. పని ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. పాము, తేలు కాటుకు గురవుతున్నట్లు తెలిపారు. ఆ సమయంలో తమకు ఎలాంటి రక్షణ ఉండటం లేదని తెలిపారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు కార్మికులకు రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజెస్ మాట్లాడుతూ పని ప్రదేశాలలో టెంట్లు, మంచినీరు, మజ్జిగ, ఒఆర్ఎస్ పాకెట్లు ఎక్కడా కనిపించడం లేదన్నారు. వాటికి కేటాయిస్తున్న నిధులు ఏమవుతున్నాయని ఆయన పశ్నించారు. కూలీలకు రోజు వారీ కూలి రూ.300 వచ్చేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

హనుమంతునిపాడు : మండల పరిధిలోని నల్లగండ్ల, హనుమంతునిపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారం రోజులు పనిచేసినా మొత్త రూ.344 వచ్చినట్లు కూలీలు తెలిపారు. దీంతో అర్ధ ఆకలితో గడపాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా కూలీలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రోజు వారీ కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు రాజేష్, యెహెూషువా, సుందర్ బాబు, మత్తయ్య, ఏసు, నరేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో కూలీలతో మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

పామూరు : మండల పరిధిలోని బొట్లగూడూరు, పాబోలు వారి పల్లి ,అయ్యవారిపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ నాయకుడు కొమ్మలపాటి మాల్యాద్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండుటెండల్లో చేతులు బొబ్బలెక్కేలా పనిచేస్తున్నట్లు కూలీలు తెలిపారు. పని ప్రదేశంలో కనీసం తాగడానికి నీరు అందుబాటు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎలు, ఉపాధి మేట్లు, కూలీలు మాలకొండయ్య నరేష్ నారాయణ వెంకటేశ్వర్లు కొండయ్య తదితరులు పాల్గొన్నారు

'శిద్దా' వివాహ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు సేవా కార్యక్రమాలతో శుక్రవారం నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ గిరిబాబు, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఒంగోలులోని శివం శరణాలయంలో భారీ కేక్ కట్ చేశారు. 350 మంది పేదలకు అన్నదానం చేశారు. రిమ్స్ అసుపత్రిలో అన్నదానం చేశారు. ఏడుగురు వృద్ధులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. చీమకుర్తి హరిహరక్షేత్రంలో వాసవీ మహిళలు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ శిద్దా రాఘవరావు, లక్ష్మిపద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం, ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమన్నారు. శివం పౌండేషన్ సంచారవాహనం ద్వారా నగరంలోని 350 మంది పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమని తెలిపారు. గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఎ. గిరిబాబు మాట్లాడుతూ తమ యజమాని శిద్దారాఘవరావు వివావ వార్షికోత్సవం సంధర్భంగా ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివం పౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఎ.గిరిబాబు, మండవ ట్రాన్స్‌పోర్ట్స్ అధినేతలు మండవ గోపి,మండవ శ్రీనివాసరావు, గ్రానైట్ వ్యాపారులు బివిఎల్. వెంకటరావు, నల్లూరి సత్యనారాయణ, యువ పారిశ్రామికవేత్తలు బొమ్మిశెట్టి రవికిరణ కుమార్, గ్రంధి శ్రీహరి, చల్లగండ్ల హనుమంతరావు, నూకల సురేంద్ర కుమార్, అశోక్, వెలుగు సుబ్బారావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

దర్శి : మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా దర్శిలోని శిరిడి సాయిబాబా వద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. తొలుత శిద్దారాఘవరావు ప్రతినిధి మందాడి సుబ్బారావు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు, శిద్దా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నగదు అందజేస్తున్న ఎ. గిరిబాబు

సీతారామయ్యకు ఎమ్మెల్యే స్వామి నివాళి

ప్రజాశక్తి- టంగుటూరు

ప్రముఖ పారిశ్రామిక వేత్త, టంగుటూరు మాజీ ఉప సర్పంచి చిడిపోతు సీతారామయ్య (83) శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరరాంజనేయ స్వామి, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారామయ్య మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. సీతారామయ్యకు నివాళులర్పించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు కామని విజయ కుమార్, పట్టణ అధ్యక్షుడు కామని నాగ శ్రీను, తెలుగు యువత మండల అధ్యక్షుడు అబ్బూరి అభిషేక్, ఉప సర్పంచి కామని వెంకట్రావు, సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్ ఉన్నారు.

తిరుపతి స్వాములు సేవలు మరువలేనివి

యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-దర్శి

ఉపాధ్యాయుడిగా, యుటిఎఫ్ నాయకుడిగా దామా తిరుపతి స్వాములు అందించిన సేవలు మరువలేనివని యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక అద్దంకి రోడ్‌లోని పద్మావతి కళ్యాణ మండపంలో తిరుపతి స్వాములు ఉద్యోగ విరమణ సన్మాన సభ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు మీనిగ శ్రీను అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి స్వాములు ఉపాధ్యాయుడి పిల్లలను తీర్చి దిద్దాటానికి, యుటిఎఫ్ బలోపేతానికి ఎంతో కషి చేశారనికొనియాడారు. దర్శి ఎంఇఒలు కాకర్ల రఘురామయ్య, బి.రమాదేవి మాట్లాడుతూ స్వాములు వత్తి పట్ల అంకితభావంతో పని చేసినట్లు తెలిపారు. ఎక్కడ పని చేసినా ఆ పాఠశాలకు మంచి పేరు తెచ్చారని కొనియాడారు. ఎప్పుడూ ముక్కు సూటిగా మాట్లాడుతూ నిబద్ధతతో విద్యార్థుల పట్ల పని చేసిన వ్యక్తి అని కొనియాడారు. తిరుపతి స్వాములు తాను పుట్టిన ఊరులోనే ఉద్యోగ విరమణ చేయడం అరుదైన గౌరవమని కొనియాడారు. అనంతరం దామా తిరుపతి స్వాములు, ఆయన సతీమణి వెంకటరమణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధనరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా సహాయకులు అబ్దుల్‌హై, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, మండల కార్యదర్శి కాసిం, సిఐటియు డివిజన్ కార్యదర్శి తాండవ రంగారావు పాల్గొన్నారు.

స్వాములు దంపతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి -కనిగిరి

తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టిడిపి కూటమి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగాకలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలు, కనిగిరిలో గెలుపు గురించి చర్చించుకున్నారు. అనంతరం డాక్టర్ ఉగ్రను రేవంత్ రెడ్డి అభినందించారు.

తుమ్మ బాలకు నివాళి

మతసామరస్యం కోసం తన జీవితాంతం కషి చేసిన విశ్రాంత బిషప్ తుమ్మ బాల మతిచెందాడు. ఆయన పార్థివ దేహాన్ని తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిడిపి కూటమి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సందర్శించి నివాళు లర్పించారు. మత సామరస్యం కోసం బిషప్ తుమ్మల బాల చేసిన కషిని కొనియాడారు.

బహుతులు అందజేస్తున్న నాయకులు

ముగిసిన సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి-పామూరు

చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో పామూరులో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఐదు రోజులుగా విద్యార్థులకు ఆటలు, పాటలు, దేశభక్తి గేయాలు, పొడుపు కథలు సైన్స్, క్రాఫ్ట్ డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జెజెవి గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి. చెన్నకష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి భావాలు. నడవడిక వ్యక్తిగత ఆరోగ్యం శుభ్రత వంటి భావన నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు అబ్దుల్, కె. శంకర్, ఐద్వా నాయకులు షర్మిల, సరళ దేవి, భానుమతి, అంజలి పాల్గొన్నారు

వడదెబ్బ నివారణపై అవగాహన

శింగరాయకొండ : శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక సుబ్బరామిరెడ్డి నగర్, రైల్వే రోడ్డులో ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, వైద్య సిబ్బంది వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మసూద్ అలీ మాట్లాడుతూ చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రతలు పెరగటం, ఒణుకు పుట్టటం, మగత నిద్ర, కలవరింతలు లాంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. గర్భిణులు, వృద్ధులు, పిల్లలు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగరాదని సూచించారు. అత్యవసర సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తలపాగ, తెల్లని దుస్తులు ధరించాలని సూచించినారు ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎం.నాగమణి, నసీమున్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంచనాల్లో అభ్యర్థులు.. ఊహల్లో కార్యకర్తలు

యర్రగొండపాలెంలో టెన్షన్.. టెన్షన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సార్వత్రిక ఎన్నికలు ముగిసి కౌంటింగుకు రోజులు దగ్గరపడుతున్న క్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గం అభ్యర్థుల్లో టెన్షన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు పోలింగ్‌ను అనుసరించి అంచనాల్లో అభ్యర్థులు ఉన్నారు. తమ నాయకుడే విజయం సాధిస్తాడని ఇరుపక్షాల పార్టీల కార్యకర్తలు, నాయకులు ధీమాగా ఉన్నారు. జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో యర్రగొండ పాలెం నియోజకవర్గంలో ఇరు పార్టీల్లో బెట్టింగులు కూడా జోరందుకున్నాయి. యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి 14 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. కానీ ప్రధానంగా టిడిపి, వైసీపీల మధ్యే పోటీ నెలకొంది. అధికార పార్టీ అయిన వైసిపి నుంచి తాటిపర్తి చంద్రశేఖర్, టిడిపి నుంచి గూడూరి ఎరిక్షన్‌బాబు పోటీలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా ఉన్న తాటిపర్తి చంద్రశేఖర్ గెలుపుపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో టిడిపి శ్రేణులు శ్రమించినట్లు కనిపిస్తోంది. వైసిపిలో ఉన్న అసంతృప్తి, అసమ్మతి, ప్రభుత్వంపై వ్యతిరేకత, మూడు సంవత్సరాల నుంచి ప్రజల్లో ఉండడం, ముందస్తుగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించడం తదితర అంశాలు గూడూరి ఎరిక్షన్‌బాబుకు కలిసొస్తాయని ఆ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆదిమూలపు సురేష్‌కు 31 వేల పైచిలుకు మెజార్టీ వచ్చింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాటిపర్తి చంద్రశేఖర్ కూడా ఆ మెజార్టీకి తగ్గకుండా మెరుగైన మెజార్టీ సాధించాలని ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పోటీపడ్డారు. టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు కూడా అందరినీ కలుపుకొని ఎలాగైనా వైసీపీ కంచుకోటను బద్దలుకొట్టి టిడిపి జెండాను ఎగురవేయాలని విశ్వప్రయత్నాలు చేశారు. ప్రజల్ని సైతం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వినియోగించుకునేలా కష్టపడ్డారు. ఈ నేపథ్యంలో ఎలాగైనా గెలుపు తమదేనన్న ధీమాలో టిడిపి శ్రేణులు ఉన్నారు.

పెరిగిన పోలింగ్‌పై ఆశలు..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో 2,07,212 మంది ఓటర్లు ఉండగా 89.40 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా యర్రగొండపాలెం మండలంలో 48,704 మంది ఓటర్లు ఉండగా 43,555 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 89.42 శాతం ఓట్లు పోలయ్యాయి. పుల్లలచెరువు మండలంలో 42,065 మంది ఓటర్లు ఉండగా 38,168 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 90.73 శాతం ఓట్లు పోలయ్యాయి. త్రిపురాంతకం మండలంలో 48,836 మంది ఓటర్లు ఉండగా 43,365 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.79 శాతం ఓట్లు పోలయ్యాయి. పెద్దదోర్నాల మండలంలో 33,755 మంది ఓటర్లు ఉండగా 29,151 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.36 శాతం ఓట్లు పోలయ్యాయి. పెద్దారవీడు మండలంలో 33,854 మంది ఓటర్లు ఉండగా 31,002 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 91.57 శాతం ఓట్లు పోలయ్యా యి. నియోజకవర్గ పరిధిలో 265 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన జాబితాలను సిద్ధం చేసుకుని ఒక్కొక్క బూత్‌లో తమ పార్టీకి ఎన్ని ఓట్లు చొప్పున పడ్డాయోనని ఇరు పార్టీల నేతలు లెక్కలు కట్టుకుంటున్నారు.



యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గం పటం

ఇద్దరూ వలస నేతలే..

వైసిపి అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ సింగరాయకొండకు చెందినవారు. అలాగే టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు కనిగిరికి చెందినవారు. ఇద్దరూ వలస నేతలే అయినప్పటికీ యర్రగొండపాలెం ఎస్సీ నియోజకవర్గం కావడంతో నియోజకవర్గంలోని ఇరు పార్టీల్లో ఆర్థికంగా బలమైన నాయకుడు లేకపోవడంతో ఇరు పార్టీలూ వలస నేతలనే పంపాయి. వారే అభ్యర్థులుగా నిలిచారు. టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు మూడేళ్ల నుంచి టిడిపి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల పట్ల టిడిపి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూ ప్రజలకు పరిచయమైన వ్యక్తిగా ఉన్నారు. అయితే వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ కూడా ఎన్నికలకు కొద్ది రోజుల ముందే వైసీపీ అభ్యర్థిగా అధిష్టానం నియమించినప్పటికీ అధికార పార్టీ కావడంతో ప్రజలకు పరిచయం అవడమే కాకుండా వైసీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగారు.

తాటిపర్తి చంద్రశేఖర్, గూడూరి ఎరిక్షన్‌బాబు

మెజార్టీపైనే ఆశలు..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ విజయం సాధిస్తుందని, 10 వేల మెజార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నేతలు అంటున్నారు. టిడిపి మాత్రం 3,000 నుంచి 3,500 మెజార్టీతో ఖచ్చితంగా విజయం సాధిస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో వైపాలెం నియోజకవర్గంలో వైసీపీ 10 వేల మెజార్టీపై కొందరు లక్షల్లో బెట్టింగ్‌లు కాసినట్లు సమాచారం. టిడిపి మెజార్టీపై కాకుండా ఖచ్చితంగా సీటు గెలుస్తుందని కొందరు లక్షల్లో టిడిపి నేతలు కూడా బెట్టింగ్‌లు కాసినట్లు తెలుస్తోంది. పైకి ఇరు పార్టీలూ గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా గెలుపోటములపై బూత్‌ల వారీగా సమీక్షలు చేపడుతూనే ఉన్నారు. ఏది ఏమైనా జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడే వరకు యర్రగొండపాలెం నియోజకవర్గంలో అటు నాయకులు, ఇటు కార్యకర్తల్లో టెన్షన్ టెన్షనే.

కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న సీఐ సోమయ్య, సిబ్బంది

గిద్దలూరులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని పిఆర్ కాలనీలో తెల్లవారుజామున నిర్వహించిన కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో ఎటువంటి రికార్డులు లేని 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు అర్బన్ సీఐ వైవీ సోమయ్య ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు జరిగిన ఈ ఆపరేషన్‌లో గిద్దలూరు ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

వైపాలెం నూతన ఆర్వోగా..

వెంకట సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారిగా ఇప్పటి వరకు సివిల్ సప్లయ్ డిఎంగా పని చేస్తున్న ఎం వెంకట సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన యర్రగొండపాలెంలోని ఆర్వో కార్యాలయానికి వచ్చారు. ఆర్వో కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. జరిగిన ఎన్నికలు, ఏర్పాట్లు, అధికారులు, సిబ్బంది తీరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ సమన్వయంగా పని చేసి కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేద్దామని తెలిపారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట సత్యనారాయణ



ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని వైచెర్లోపల్లి జడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, దోర్నాల ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, తిమ్మాపురం ఎంపియూపి పాఠశాలల ఎస్‌జిటి బాలశౌరి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వీరిని శుక్రవారం పెద్దదోర్నాలలోని ఎంఈవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మస్తాన్ నాయక్, కొండల్‌రావు, యూటిఎఫ్ నాయకులు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణా నాయక్, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పోలీసు విధులకు ఆటంకం కలిగించినా, కౌంటింగ్ రోజు మండలంలో గొడవలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పుల్లలచెరువు ఎస్ఐ ఎండి ఫిరోజ్ ఫాతిమా అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ కఠినంగా అమలు చేస్తామని అన్నారు. కౌంటింగ్ సమయంలో పుల్లలచెరువు మండలంలో ఎవరైనా గొడవలు సృష్టించాలని చూస్తే వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఏ పార్టీ వారు అయినా వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే మండలంలో పోలీసు బలగాలు మోహరించాయని తెలిపారు. ఎవరైనా కొత్తవారు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.

ఎస్ఐ ఫాతిమా

కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు

కూలిరేట్లను పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఉపాధి కూలీల శ్రమ శక్తిని దృష్టిలో ఉంచుకొని వారికి కూలిరేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మంగమూరు గ్రామంలో శుక్రవారం ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశం వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పథకం ప్రారంభంలో మాత్రమే కొద్ది మందికి పలుగు పారలు ఇచ్చారని, ఆ తర్వాత ఇవ్వలేదని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఇతర వస్తువుల ధరలు కారణంగా జీవనం సాగించటం కష్టంగా మారిందన్నారు. ఉపాధి కూలి రేటును పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కూలీలు డిమాండ్ చేస్తుంటే రెండోవైపు ప్రభుత్వం బడ్జెట్లో ఏటా నిధులు తగ్గిస్తూ రావడం అన్యాయమన్నారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్కే మస్తాన్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిలబెట్టుకోవడానికి కూలీలందరూ ఐక్యంగా ఉండి పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో జె బాబురావు, అచ్చయ్య, బ్రహ్మయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పోలీసు నిఘా నీడలో పొదిలి

- 20 సిసి కెమెరాలు, డ్రోన్‌లతో నిరంతరం పర్యవేక్షణ
- ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణం పోలీసుల నిఘా నీడలోకి వెళ్లిపోయింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సార్వత్రిక ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో పోలీసులు తాము మాత్రం తక్కువ తిన్నామా అన్నట్లు పొదిలి పట్టణంతో పాటు సమస్యాత్మక గ్రామాలుగా ఉన్న వాటితో పాటు దాదాపు అన్ని గ్రామాలను నిఘా నీడలోకి తీసుకువచ్చారు. సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన వాటిలో ఒక్క నందిపాలెంలో మినహా ఎక్కడా ఎటువంటి సంఘటనలు పోలింగ్ సందర్భంగా జరగలేదు. అయితే పోలింగ్ అనంతరం గెలుపు ఓటములు, ఏ గ్రామంలో ఏ పార్టీకి మెజార్టీ వస్తుందనే అంచనాలతో గ్రామాలలో కొంత ఉద్రిక్త పరిస్థితులను పోలీసులు గుర్తించారు. దీనికి తోడు సామాజిక మాధ్యమాలలో సైతం గెలుపోటములపై రెచ్చగొట్టే విధంగా పోస్టులు వస్తుండటంతో కౌటింగ్ నాటికి పరిస్థితులు ఏవిధంగా ఉంటాయో పోలీసులకు సైతం అంతుబట్టని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పొదిలి పట్టణంలో 20 సిసి కెమెరాలతో పాటు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్‌తో నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి మల్లికార్జునరావు, ఎస్ఐ జి కోటయ్య పట్టణంలోని పలు కూడళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు, దర్శి డిఎస్పి సూచనలతో జూన్ 4న జరుగు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొదిలి టౌన్ మరియు గ్రామాలలో తగిన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా పొదిలి పట్టణంలో 20 సీసీ కెమెరాలు, ఇతర సమస్యాత్మక గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు పొదిలి పట్టణంలో ఆధునిక టెక్నాలజీతో పనిచేసే డ్రోన్ కెమెరాతో నిరంతర నిఘ ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా సమస్యత్మక గ్రామాలలో పోలీస్ పికెట్లను ఏర్పాటు చేయడంతో పాటు మండలం మొత్తాన్ని రూట్ మొబైల్ వాహనంలో తిరుగుతూ ఏదైనా గ్రామాల సమస్య ఉంటే పది నిమిషాలలో అక్కడికి చేరే విధంగా తగిన బందోబస్తు ఏర్పాటును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగించినట్లయితే అట్టివారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనుక పొదిలి మండలంలోని ప్రజలందరూ జూన్ 4న వెలువడే ఫలితాలను సంయమనంతో స్వీకరిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పొదిలి పట్టణంలో ప్రధాన రహదారిలోని జూనియర్ కాలేజి కూడలిలో డ్రోన్‌తో పర్యవేక్షణ కోసం తీసిన చిత్రం

ప్రజాశక్తి
7
శనివారం 1 జూన్ 2024

కలుషిత నీటితో ప్రజల్లో ఆందోళన

● నిరుపయోగంగా ఫిల్టర్ బెడ్లు ● పాచిపట్టి దుర్గంధం వస్తున్న నీటినే సరఫరా ● తాగునీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు గ్రామాల్లో రూ.లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన ఫిల్టర్ బెడ్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. మండలంలో ఎక్కడ చూసినా ఫిల్టర్ బెడ్లు పనిచేయకపోవడంతో నీటిని శుద్ధి చేయకుండానే పంచాయితీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. దీనివల్ల నీరు కలుషితమై రంగు మారి దుర్వాసన వెదజల్లుతుంది. ఆ నీటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా వేయకుండా నీటిని సరఫరా చేస్తుండటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లో ఫిల్టర్ బెడ్‌లలో కనీసం ఇసుకను కూడా మార్చలేని పరిస్థితి ఏర్పడింది. ఫిల్టర్ బెడ్లను మెరుగుపరచి వాటిని సక్రమంగా వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు సురక్షిత నీటిని అందించాల్సిన అధికారులు కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో కలుషిత నీటితోనే ప్రజలు కాలం వెళ్ళబుచాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో ప్రక్క మంచినీటి చెరువులను అభివృద్ధి చేయకపోవడంతో ఏళ్ళ తరబడి తామర, తూటు ఆకులతో పాచి పేరుకుపోయి నీరు కలుషితంగా మారాయి. దీంతో సమస్య మరింత జటిలంగా మారింది. ఒకపక్క దుర్గంధం మరో ప్రక్క రంగు మారి కలుషిత నీటితో ఎలాంటి చర్మవ్యాధులు ప్రబలతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు, ఉప్పుటూరు, అడుసుమల్లి, చెరుకూరు, కొల్లవారిపాలెం, పోతుకట్ల, నాగులపాలెం, నూతలపాడు, వీరన్నపాలెం తదితర గ్రామాల్లో పరిస్థితి మరింత ధయనీయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి అలంకార ప్రాయంగా ఉన్న ఫిల్టర్ బెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా ఉన్నత అధికారులు సత్వర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పాచిపట్టి కంపు కొడుతున్న ఫిల్టర్‌బెడ్లు

వేడి తట్టుకోలేక ఇంటిలో నీళ్లు నింపుకొని..

● నిప్పుల కొలిమిలా ఎండలు ● విలవిల్లాడుతున్న వృద్ధులు, పిల్లలు, రోగులు

ప్రజాశక్తి- సంతమాగులూరు

గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు విలవిలల్లాడుతున్నారు. గత 5రోజుల నుండి వీస్తున్న వడగాలులకు బెంబేలెత్తుతున్నారు. వృద్ధులు తమ ప్రాణాలు కాపాడు కోవటం కోసం వాటర్ కూలర్లు, టేబుల్ ఫ్యాన్లను వినియోగిస్తున్నారు. మండలంలోని పాతమాగులూరు గ్రామానికి చెందిన ఒక కుటుంబం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సర్పంచి జిర్రా విజయబాబు తమ ఇంటిలో ఏసీ లేకపోవడంతో కుటుంబ సభ్యుల ఆరోగ్యరీత్యా ఇంటిలోని తమ పడక గదిలో సామానులన్నీ సర్దుకుని మూడు అంగుళాల మేర నీటిని నింపారు. ఆ నీటిలో మంచాలు వేసుకుని సేద తీరుతున్నారు. నీటిని నింపడం వల్ల ఆ గది ఏసీని తలపించే విధంగా చల్లగా మారింది. దీంతో కరెంటు బిల్లులు భారం తగ్గించుకోవడంతోపాటు సహజ సిద్ధమైన శీతలీకరణ చేసుకున్నారు. దీనికి ఎలాంటి ఖర్చు లేదని, నీటి సౌకర్యంఉంటే సరిపోతుందని సర్పంచి విజయ్ బాబు ప్రజాశక్తికి తెలిపారు. గత కొన్నేళ్లుగా తాము ఇదే పద్ధతిని అవలంబిస్తున్నట్లు తెలిపారు.

ఇంకొల్లు : ఈనెల 25న రోహిణి కార్తె వచ్చినప్పటి నుండి ఏ రోజు కారోజు వడగాలులు విపరీతంగా వీస్తున్నాయి. గురువారం కూడా వాతావరణం 42డిగ్రీల సెంటిగ్రేడ్ చూపించింది. వాతావరణం నిప్పుల కొలిమిలా మారింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు వేడిగాలి వీస్తూ ఉండటంతో ప్రజలు అత్యవసర సమయాల్లో తప్పితే బయటకు రావటం లేదు. జన సంచారం తగ్గింది. ప్రధాన వీధులు కూడా సాయంత్రం 5 గంటల వరకు నిర్మాణస్యంగా ఉన్నాయి. వీది దుకాణాలు నిర్వహించేవారు, తోపుడుబండ్లపై పండ్లు అమ్మేవారు ఈ ఎండలకు విపరీతంగా అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో పట్టలు అడ్డం కట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. కొనుగోలుకు ఎండ దాటికి ఎవరూ రాకపోవడంతో సాయంత్రం ఐదు గంటల వరకు అమ్మకాలు ఆపేసి సాయంత్రం మరలా సాగించారు. ఈ వేడి దాటికి వృద్ధులు, పిల్లలు, రోగులు విపరీతంగా అవస్థలు పడుతూ విల విలాడుతున్నారు. చల్లని ద్రవ పదార్థాలు, శీతల పానీయాలు, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, పుచ్చకాయలు, కొబ్బరి నీళ్లు, తాటి ముంజలు వంటిటివి ఎక్కువగా ఆహారంగా సేకరిస్తున్నారు.

పర్చూరు : ఎండలు మండి పోతున్నాయి. పర్చూరులో గురువారం మధ్యాహ్నం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఉక్క పోత, వడగాల్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 10 గంటల నుంచి ఎండ వేడి ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రాలేదు. వ్యాపార సముదాయాలు, హెూటళ్ల కొనుగోలు దారులు లేక వెల వెల బోయాయి. సాయంత్రం 4గంటలకు కూడా వేడిగాలు ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మరో 4రోజులు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది. ద్విచక్ర వాహనదారులు ఈ వేడిమిని తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు.

నీళ్లు నింపిన గదిలో సేద తీరుతున్న దృశ్యం

తక్షణమే ఆ జీవోలు రద్దు చేయాలి

గ్రూప్ 2, 3, 4 పరీక్షల్లో టైప్‌రైటింగ్ రద్దుపై సిపిఐ నిరసన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసేందుకు మార్చి 12న తీసుకువచ్చిన జీఓ నెంబర్ 26, 27, 28 తక్షణమే రద్దు చేయాలని సిపిఐ జిల్లా నాయకులు గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు గత 20 ఏళ్లుగా గ్రూప్-3, 4 ద్వారా నియామకాలు జరపకుండా అవసరాన్ని బట్టి కాంట్రాక్టు, కారుణ్య నియామకాలు చేపడుతూ నిరుద్యోగ యువతను మోసం చేశాయని ఆరోపించారు. యువతకు ఉపాధి చూపలేని ప్రభుత్వం మార్చి 2న తీసుకువచ్చిన జిఒలు నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేసిందని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఇప్పటివరకు గ్రూప్ 2, 3, 4కు ఉన్న టైఫ్ రైటింగ్ సిస్టం ఎత్తివేసి తప్పనిసరిగా సిపిటి కోర్సు ఉత్తీర్ణత సాధించాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. దీనివలన అనేక మంది టైపు రైటింగ్ నేర్చుకున్న నిరుద్యోగులు మరల సిపిటి కోర్సు చేయడానికి అష్ట కష్టాలు పడాల్సిన దుస్థితి నెలపొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 12న విడుదల చేసిన మూడు జిఒలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ జీవులను రద్దు చేయకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతను కలుపుకుని ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బండారు శ్రీనివాసరావు, విష్ణుమొలకల శ్రీనివాసరావు, వంగర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు గొట్టుముక్కల బాలాజీ

గెలుపోటములు సహజం

● ప్రజా నిర్ణయాన్ని శిరసావహించాలి ● రిటర్నింగ్ అధికారి రవీందర్

ప్రజాశక్తి - పర్చూరు

గెలుపు, ఓటములు సహజమని, అందరూ ప్రజా తీర్పుని శిరసా వహించాలని రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఎన్నికల్లో పోటీపడిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ల్లెక్కింపు కేంద్రంలో అనుసరించాల్సిన నియమావళి గురించి వివరించారు. ఎవరూ ఆక్రోశాలకు పోవద్దని, లెక్కింపు కేంద్రంలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని కోరారు. గెలుపు, ఓటములు నిర్ణయించటానికే ఎన్నికలు నిర్వహించారన్న విషయాన్ని అందరూ తెలుసుకోవాలని అన్నారు. లెక్కింపు కేంద్రంలో ప్రతి ఒక్కరు ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అన్నారు. లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఎవరూ బయటికి రావద్దని చెప్పారు. లెక్కింపు కేంద్రంలో కేరింతలు కొట్టడం నిషేధమని తెలిపారు. ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపును సజావుగా జరగటానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ మురళీ కృష్ణ, పర్చూరు సిఐ సీతారామయ్య, ఎఆర్‌ఒలు సుబ్బయ్య, సంధ్యశ్రీ, మెహర్ బాబు, ప్రమీల, నాగరాజు, ఫణీంద్ర బాబు, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఒ, బాపట్ల ఆర్‌డిఒ జి రవీంధర్

వంట పరికరాలు బహుకరిస్తున్న ఎస్‌బిఐ అధికారులు

అన్నసత్రానికి వంట పరికరాల బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అన్నదానంనకు అవసరమైన స్టీమ్ కిచెన్ ఐటమ్స్, బాయిలర్స్ పరికరాలను ఎస్‌బిఐ అద్దంకి బ్రాంచి రూ.10లక్షలతో ఏర్పాటు చేసింది. స్వామి వారి దేవస్థానంలో అన్నదాన భవనంలో సిఎస్ఆర్ యాక్టివిటీ ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ గుణేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వామివారికి అన్నదానంలో తమ వంతు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి దేవస్థానం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్, కార్యనిర్వాహన అధికారి టి సుభద్ర, వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచిని పమార్శిస్తున్న హనిమిరెడ్డి

దమ్ము శ్రీనివాసరావుకు మాతృవియోగం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని గురిజేపల్లి మాజీ సర్పంచి దమ్ము శ్రీనివాసరావు తల్లి దమ్ము ఏగమ్మ (80) శుక్రవారం ఉదయం వడదెబ్బకు మృతి చెందారు. ఏగమ్మకు నలుగురు సంతానం. ఆమె భర్త ఇదివరకే మృతి చెందాడు. శ్రీనివాసరావు కుటుంబాన్ని అద్దంకి నియోజకవర్గం వైసీపీ ఎంఎల్‌ఎ అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో సెబ్ అధికారులు

గోవా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని స్టువర్టుపురంలో 420 గోవా మద్యం క్వార్టర్ సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఉయ్యాల ఆనంద్, ఉయ్యాల అరుణ గృహాలపై దాడి చేసి వారి వద్ద నుండి 380 క్లాసిక్ విస్కీ క్వార్టర్ బాటిళ్లు, మరో 40 మాన్షన్ హౌస్ బ్రాండ్ క్వార్టర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరినీ అదుపులో తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. రూ.45వేల విలువైన మద్యం స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదే విధంగా వీరిద్దరిపై గోవా మద్యం అక్రమంగా అమ్మతున్నట్లు తమ స్టేషన్లో కేసు నమోదై ఉందని తెలిపారు.

ఓట్ల లెక్కింపు విధుల్లో ఉన్న వారు..

సమర్ధవంతంగా పనిచేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓట్ల లెక్కింపు విధులకు నియమించబడిన వారంతా సమర్ధతతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు తెలిపారు. కమ్యూనికేషన్ సెంటర్, మీడియా సెంటర్, కంపెలేషన్ సెంటర్‌లోని సిబ్బందికి శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు, పొరపాట్లు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా రెవెన్యూ అధికారి చెప్పారు. అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఆర్వోల సూచనలు పాటించాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్వోలు ధ్రువీకరించిన తదుపరి ఓట్ల లెక్కింపు వివరాలను మీడియాకు ప్రకటించాలని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు విధులలో ఉన్న వారంతా చాలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధివిధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, డిఐపీఆరోఓ సహాయ సంచాలకురాలు కె.సుభాషిణి, ఎపిఎంఐపి పీడీ వెంకటరమణ, ఏ-సెక్షన్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

జార్జి ఆశయాలే లక్ష్యంగా..

విద్యాసంస్థల నిర్వహణ

మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

జార్జి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

మారుమూల ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో జార్జి విద్యా సంస్థలను కీర్తి శేషులు డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి-థెరిసమ్మలు నెలకొల్పారని, వారి ఆశయాలే లక్ష్యంగా జార్జి విద్యా సంస్థల నిర్వహణ కొనసాగుతుందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మార్కాపురం సమీపంలోని దరిమడుగు గ్రామ సమీపాన గల జార్జి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జార్జి ఘాట్ వద్ద డాక్టర్ జార్జి 92వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి డాక్టర్ సురేష్ ముందుగా జార్జి ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం జార్జి కాంస్య విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు అందించాలన్న సామాజిక సేవా దక్పథం డాక్టర్ జార్జికి ఉందన్నారు. అప్పట్లో డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలను జిల్లాలో మొట్టమొదటగా మార్కాపురంలో స్థాపించడం జరిగిందని గుర్తుచేశారు. ఆ లక్ష్యసాధన ధ్యేయంగా జార్జి విద్యాసంస్థలు ముందుకు వెళ్తున్నాయని చెప్పారు. పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం కళాశాల లక్ష్యమన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడంతో పాటు వారికి మంచి క్రమశిక్షణ, నైతిక విలువలతో పాటు వివిధ రంగాలలో శిక్షణను అందిస్తూ ఉత్తమ విద్యార్థులుగా తమ సంస్థ తీర్చిదిద్దుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు, డీన్ డాక్టర్ ఎం.మస్తానయ్య, ఈశ్వరయ్య, డానియల్, జోసఫ్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో దీర్ఘకాలిక వ్యాధులు

పొగాకు వ్యతిరేక ర్యాలీని ప్రారంభించిన డిఎంహెచ్ఓ

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో నరాలు దెబ్బతినటంతో పాటు హార్ట్ ఎటాక్, దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం, ర్యాలీని నిర్వహించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ధూమపానంతో కలిగే నష్టాలను వివరించారు. దేశంలో నేడు యువత ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నారని, తద్వారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. యువత వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి మాట్లాడుతూ పొగాకు పదార్థాలను వినియోగించడంతో అనేక రకాలైన దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్లకు గురి అవుతున్నారన్నారు. అనంతరం పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఓ సంతకం చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్లోరోసిస్ డాక్టర్ బి అనిల్‌కుమార్, సైకాలజిస్ట్ శ్రీనివాసులు, సోషల్ వర్కర్ రాజేశ్వరి, ఎఫ్ఎల్ఓ రాజేష్, నర్సింగ్ స్టూడెంట్స్, రిమ్స్ స్టాఫ్, ఆశాలు పాల్గొన్నారు.

టోల్‌ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్

మాట్లాడుతున్న జి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశవ్యాప్తంగా జూన్ 1 నుంచి అమలయ్యే టోల్ ఛార్జీల పెంపును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఒంగోలు సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో జి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి టోల్ ప్లాజాల టోల్ ఛార్జీలు 5 నుంచి 7 వరకు పెంచాలని నిర్ణయించిందని, పెంచిన టోల్ ఛార్జీలతో రాష్ట్రంలో రూ.1190 కోట్ల భారం ప్రజల మీద పడనుందన్నారు. ఈ నిర్ణయం 18వ లోక్‌సభ ఎన్నికలకు ముందే నిర్ణయం జరిగిందని, ఎన్నికలను దష్టిలో పెట్టుకొని ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ఎన్నికల అనంతరం టోల్ ఛార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. ఈ నిర్ణయాన్ని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్రంలో మొత్తం 72 టోల్ ప్లాజాలు ఉన్నాయని, ఒక్కొక్క టోల్ ప్లాజా ఎన్ని వాహనాలు రోజుల్లో తిరుగుతున్నాయో లెక్కించి టోల్ ఫీజులు వసూలు చేస్తారన్నారు. నేషనల్ హైవేస్ ద్వారా 26 వేల కిలోమీటర్లు ప్రైవేట్ వాళ్లకి రోడ్లు అప్పజెప్పడం జరిగిందన్నారు. ప్రైవేట్ వారికి రోడ్లు అప్పగించడంతో టోల్ ప్లాజాలు 20, 30 కిలోమీటర్ల కి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదే జరిగితే ప్రజలపై ఈ భారం ఎక్కువ పడే అవకాశం ఉందన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ద్వారా 26 వేల కిలోమీటర్లు ప్రైవేట్‌కు అప్పజెప్పిన తర్వాత నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకి నియంత్రణ తగ్గుతుందన్నారు. ప్రస్తుతం టూవీలర్, త్రీ వీలర్ కు ఛార్జీలు లేవని, .నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ అమలు జరిగితే ప్రతి వాహనానికి ఛార్జీ వేసే అవకాశం ఉందన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సెస్‌తో పాటు టోల్ వసూలు చేయటం దుర్మార్గమన్నారు. 1997లో కిలోమీటర్లకు రూ.1.50 వసూలు చేస్తే ప్రస్తుతం 8 రూపాయలు వసూలు చేయటం సరికాదని, .వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో రవాణా రంగం నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయం

- ఎటువంటి సమస్యలు వచ్చినా అండగా ఉంటాం..
- ఎస్పీ వకుల్ జిందాల్

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరిస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పోలీస్ శాఖకు మీరు అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కొనియాడారు. శుక్రవారం జిల్లా క్యాంపు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన నలుగురు పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ పూలమాల వేసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉద్యోగవిరమణ పొందిన పోలీస్ అధికారులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు, పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందన్నారు. అలాంటి ఉద్యోగంలో మనం చేరడం చాలా గొప్ప అదష్టంగా భావించలన్నారు. పోలీస్ శాఖకు సుదీర్ఘ కాలంపాటు విశేషసేవలు అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు, ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా కలవవచ్చునని, సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందింది వీళ్లే..

కె.సిహెచ్.సాంబయ్య 1983 వ సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలోకి ప్రవేశించి ఇన్స్పెక్టర్ స్థాయిలో పదవీ విరమణ చేశారు. ఐ.శ్రీనివాసరావు 1989 వ సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలోకి ప్రవేశించి సబ్ ఇన్స్పెక్టర్ స్థాయిలో పదవీ విరమణ చేశారు. పి.కాంతారావు 1982వ సంవత్సరంలో ఏ.పీ.ఎస్.పీ కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలోకి ప్రవేశించి ఏ.ఆర్.ఎస్.ఐ స్థాయిలో ఈ రోజు పదవీ విరమణ చేశారు. కె.సిహెచ్.సాంబయ్య 1989 వ సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలోకి ప్రవేశించి ఏ.ఎస్.ఐ స్థాయిలో ఈ రోజు పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్.ఐ డి.శ్రీనివాస్ రెడ్డి, అడ్మిన్ ఆర్.ఐ షేక్.మౌలుద్దిన్, ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆలోచనాశక్తి పెంచేందుకు కథలు దోహదం

- డాక్టర్ జి.రవికుమార్, ఇస్మాయిల్
- కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్

మాట్లాడుతున్న డాక్టర్ జి.రవికుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చిన్నారుల నడవడిక, చదువుపై కథలు ప్రభావం చూపుతాయని, ఆలోచనాశక్తి పెంచేందుకు అవి దోహదపడతాయని విశ్రాంత ఉప తహశీల్దార్ సయ్యద్ ఇస్మాయిల్, డాక్టర్ జి.రవికుమార్ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపు ఉత్సాహంగా కొనసాగుతోంది. సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం విశ్రాంత ఉప తహశీల్దార్ సయ్యద్ ఇస్మాయిల్, డాక్టర్ జి.రవికుమార్ విద్యార్థులకు నీతికథలు, పొడుపు కథలు చెప్పి అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కథలు నేర్చుకోవటం ద్వారా ఆలోచన శక్తిని పెంపొంది మెదడు చురుకుగా పనిచేయడానికి ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు ఖాళీ సమయాల్లో వారి పిల్లలకు నీతి కథలు, మంచి సామెతలు చెప్పాలని వారు కోరారు. ప్రతి విద్యార్థి ఒక కథ నేర్చుకుని మిగతా విద్యార్థులకు చెప్పారు. భరతనాట్యంలో 18 వరల్డ్ రికార్డులు సాధించి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు నుంచి అవార్డు స్వీకరించిన ఎనిమిదో తరగతి విద్యార్థిని సింగంశెట్టి హేమ సాయి చిత్రలేఖనంలో వరల్డ్ రికార్డు సాధించిన సింగంశెట్టి విగ్నేష్‌లు సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. చదువుతో పాటు కలలు, ఆటలు, చిత్రలేఖనం వాటిని కూడా నేర్చుకోవడం ప్రతి విద్యార్థికి అవసరమని, అన్నిటికీ పట్టుదల ముఖ్యమని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారి అనుభవాలను పంచుకున్నారు. ప్రజా నాట్యమండలి నగర కార్యదర్శి ఇంద్రజ్యోతి విద్యార్థులకు పాటలు నేర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ శనివారంతో ముగిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. చివరి రోజైన శనివారం గత 8 రోజులుగా విద్యార్థులు నేర్చుకున్న వాటిని ప్రదర్శన చేస్తారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.